క్లుప్తంగా

పీహెచ్‌సీని మండల కేంద్రంలోకి మార్చాలి

మున్సిపాలిటీ అధ్యక్షుడు నాగరాజుచారి

కొత్తూరు: తాటిగడ్డ తండాలో కొనసాగుతున్న కొత్తూరు పీహెచ్‌సీని మండల కేంద్రంలోకి మార్చాలని బీజేపీ కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు నాగరాజుచారి ఆదివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. మండలకేంద్రానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండే ప్రాథమిక వైద్యకేంద్రానికి వెళ్లేందుకు రోగులతో పాటు సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోగుల సౌకర్యార్థం మండల కేంద్రంలోకి మార్చాలని కోరారు.

నియోజకవర్గ సమావేశం నేడు

చేవెళ్ల: కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ఉంటుందని చెప్పారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి ఐదు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, మండల కమిటీల నాయకులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు అందరూ హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునితారెడ్డి, జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డిలు పాల్గొంటారని చెప్పారు.

రక్తదాన శిబిరానికి విశేషస్పందన



రక్తదానం చేస్తున్న యువకులు

కేశంపేట: గురుస్వామి సతీష్‌నాయక్ జ్ఞాపకార్థం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేషస్పందన వచ్చినట్లు అయ్యప్ప సేవాసమితి నిర్వాహకులు పేర్కొన్నారు. దీన్ని అమన్‌గల్ లయన్స్ క్లబ్ సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 51 మంది దాతలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విశ్వనాధం, మాజీ సర్పంచులు యెన్నం శ్రీధర్‌రెడ్డి, తలసాని వెంకట్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, లయన్స్ క్లబ్ మెంబర్ అంజిరెడ్డి, మధుసూదన్‌గౌడ్, శేఖర్, తిరుమల్‌గౌడ్, సంతోష్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, రమేష్, రమణరెడ్డి, సంతోష్‌కుమార్, పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చల్లా వంశీచంద్‌రెడ్డికి సన్మానం



వంశీచంద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, తదితరులు

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని ఆదివారం షాద్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ అధిష్టానం పోటీ చేసేందుకు అధికారికంగా పేరు ప్రకటించిన నేపథ్యంలో ఆయన మద్దతు కోసం స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, నాయకులను కలిసేందుకు షాద్‌నగర్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రథమ శ్రేణి న్యాయస్థానంలో ఈ నెల 11 నుంచి 16 వరకు నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రాం ఒక ప్రకటనలో కోరారు. రాజీపడదగిన కేసుల్లో ఇరువర్గాలు మాట్లాడుకొని రాజీపడాలని ఆయన సూచించారు. కేసులను రాజీ చేసుకోవడం ద్వారా ఇరువర్గాలు విజయం సాధించినట్లు అని ఆయన అన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

యాచారం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం జరుగుతుందని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ కొప్పు సుకన్య అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులతోపాటు, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ పాల్గొంటారని తెలిపారు.

భక్తి భావంతో మోక్షం

- చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పామెన భీంభరత్
- కనుల పండువగా దోపోత్సవం
- శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తుల సందడి



స్వామి వారి ఊరేగింపు



చెంచుల నృత్యం

చేవెళ్ల: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం అర్ధరాత్రి కనుల పండువగా దోపోత్సవం నిర్వహించారు. ఆలయ సమీపంలోని పుష్కరిణి వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతర ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం దోపోత్సవం. వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మను వేరువేరుగా ఆలయం నుంచి ప్రధాన చౌరస్తాల ద్వారా ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. అక్కడ వద్ద భక్త జనసందోహం మధ్య దోపోత్సవాన్ని నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి నుంచి చెంచులు ఆభరణాలు దొంగిలించి అలివేలు మంగమ్మకు అందించే ఈ కార్యక్రమాన్ని చెంచులు ఆటపాటలతో నిర్వహించారు. దీన్ని వేడుకగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. డప్పుల చప్పులతో, బ్యాండుమేళాలతో ఉత్సాహంగా కొనసాగింది. ఆభరణాలు దోచుకోవడం పూర్తయిన తరువాత వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఈఓ నరేందర్, పూజారులు శ్రీపాదు, శ్రీకాంత్, వామనాచార్యులు, వాసు, కన్న, మాజీ ఎంపీపీ ఎం. బాల్‌రాజ్, బండారి శైలజ ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, టేకులపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తి భావంతో మోక్షం లభిస్తుందన్నారు. దోపోత్సవంలో చేవెళ్ల వేంకటేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగే కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పాల్గొన్నారు. ఆయన వెంట సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, యాదగిరి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి అలివేలు మంగమ్మలను ఆలయంలోకి తీసుకెళ్తున్న నిర్వాహకులు

పోలీస్ బందోబస్త్ ..

రాత్రి జరిగిన దోపోత్సవానికి పోలీసులు గట్టి బందోబస్త్ ఏర్పాటు చేశారు. చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు. రోడ్లపై పెట్రోలింగ్ వాహనాలతో రోడ్డు క్లియర్ చేశారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

చేవెళ్ల జాతరలో అన్నదానాలు

హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

చేవెళ్ల: మండల కేంద్రంలో శివరాత్రి సందర్భంగా జాతర ఉత్సవాల్లో భక్తులకోసం ఆదివారం వేరువేరుగా దాతలు అన్నదానం చేశారు. గుండం వద్ద అత్తెల్లి జగన్నాథ్‌రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదానాన్ని సీఐ లక్ష్మారెడ్డి ప్రారంభించారు. మాజీ ఎంపీపీ ఎం. బాల్‌రాజ్ కుమారుడు ఎం. యాదరగిరి ధర్మసత్రం వద్ద చేసిన దానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. మరో చోట సెవెన్ హిల్స్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దానికి ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ భక్తుల ఆకలి తీర్చేందుకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పూజలు..

శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలు పేర్కొన్నారు. ఆదివారం వారు వేరువేరుగా వచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్, డీసీఆర్, గోనే ప్రతాప్‌రెడ్డి, ఎం. యాదగిరి, తిరుపతి రెడ్డి, జైపాల్‌రెడ్డి, నర్సింలు, మాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజలో ఎమ్మెల్యే కాలె యాదయ్య

విజయ సంకల్ప సభను జయప్రదం చేయండి

కొత్తూరు: హైదరాబాద్‌లోని ఎల్‌బీస్టేడియంలో మంగళవారం నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బూత్ లెవల్ విజయసంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్ కోరారు. కొత్తూరు పట్టణంలో ఆదివారం పట్టణ అధ్యక్షుడు నాగరాజుచారి ఆధ్వర్యంలో నిర్వహించిన కొత్తూరు, నందిగామ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌బీస్టేడియంలో జరగనున్న బూత్, శక్తి కేంద్రాల నాయకులతో నిర్వహించే సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొని వారికి పార్లమెంట్ ఎన్నికలతో పాటు పలు అంశాలపై దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమడపురం నర్సింహ్మగౌడ్, రమేశ్, శేఖర్‌గౌడ్, కుమార్, శివలింగం, అరవింద్, గణేశ్, మల్లేశ్, భానుప్రకాశ్, సందీప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్‌గౌడ్

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ యాదవ్

నందిగామ: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యమని మండల అధ్యక్షుడు జంగ నర్సింహ యాదవ్ పేర్కొన్నారు. నందిగామలో బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశాన్ని జంగ నర్సింహ యాదవ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ విజయంకోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకెళ్లాలన్నారు. ఈ విషయంలో ఓటర్లను చైతన్య పరచాల్సిన బాధ్యత ఏజెంట్లు తీసుకోవాలన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీ చంద్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల, బూత్ స్థాయి ఏజెంట్ల కో ఆర్డినేటర్ మంకాల శ్రీశైలం, పలు గ్రామాల ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్సింహ యాదవ్

నేడు సహకార సంఘం పాలకవర్గ సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం పాలకవర్గ సమావేశాన్ని సోమవారం ఉదయం 11:30 గంటలకు సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు సంఘం మేనేజర్ జక్కుల ఐలేశ్ యాదవ్ తెలిపారు. గత సమావేశ తీర్మాణాలను పరిశీలించుట, నూతన సభ్యత్వం కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన, స్వల్పకాలిక రుణాల మంజూరు, రుణాల వసూళ్లపై చర్చించడంతో పాటు సర్వసభ్య సమావేశం తేదీని నిర్ణయించడం, పంట అప్పులు సక్రమంగా చెల్లించిన రైతులను సర్వసభ్య సమావేశంలో సన్మానించి నగదు ప్రోత్సాహకం ఇచ్చే అంశం, సంఘం నుంచి రుణాలు పొంది బకాయిలున్న పాలకవర్గ సభ్యులపై చర్చ, 31 మార్చి 2023 వరకు ఉన్న సభ్యుల వాటాధనంపై 6శాతం డివిడెంట్ ఇచ్చే అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు.

నియామకం



నియామకపత్రం ఇస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ : రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా పెద్దఅంబర్‌పేటకు దాసరి నర్సింగ్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహా జారీ చేసిన నియామకపత్రాన్ని ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా నర్సింగ్‌రావుకు అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఉన్న తనపై విశ్వాసంతో జిల్లా కాంగ్రెస్ పార్టీలో చోటు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మల్‌రెడ్డిరాంరెడ్డి, పెద్ద అంబర్‌పేట కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

కేశంపేట: మండల పరిధిలో కాకునూర్ గ్రామంలోని శ్రీమహాలింగేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ, గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం స్వామి వారి కల్యాణం చేశారు. కాకునూర్ గ్రామస్తులతో పాటు కేశంపేట, బోధునంపల్లి, సుందరపురం, లేమామిడి, నిర్దవెళ్లి గ్రామస్తులు హాజరయ్యారు. అనంతరం గ్రామంలో వాలీబాల్ పోటీలను తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ గండ్ర జగదీశ్వర్‌గౌడ్, మాజీ సర్పంచులు యెన్నం శ్రీధర్‌రెడ్డి, తలసాని వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, గోగు వెంకట్‌రెడ్డి, రాములు, భాస్కర్‌గౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న తాండ్ర విశాల తదితరులు

కల్వర్టుకు కంచె నిర్మించండి

కొత్తూరు: మండల పరిధిలోని మల్లాపూర్ నుంచి గూడూరు గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో మల్లాపూర్ ఎస్సీ కాలనీ సమీపంలోని కల్వర్టు ప్రమాదాలకు నిలయంగా మారింది. దీనికి కంచె ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదాలకు అవకాశమెక్కువ. దీని గురించి పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదన్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుకు రక్షణ కంచె నిర్మించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా కల్వర్టు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1992 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు

చేవెళ్ల: వారంతా చిన్ననాటి స్నేహితులు, ఒకేచోట కలిసి చదువుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర రంగాల్లో స్థిరపడ్డారు. 32ఏళ్ల తరువాత ఆదివారం చేవెళ్ల మండలం అంతారం సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. మొయినాబాద్ మండల కేంద్రంలోని ఎంఆర్‌సీహెచ్‌ఎస్ పాఠశాలలో 1992లో పదోతరగతి చదువుకున్నారు. ఈ సందర్భంగా వారు చిన్ననాటి జ్ఞాపకాలు, చేసిన చిలిపి పనులు, అల్లర్లను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు బండారి ఆగిరెడ్డి, దేవర శ్రీనివాస్‌రెడ్డి, రవిబాబు, రామక్రిష్ణ, కవిత, అనసూయ, రవీందర్, చంద్ర ప్రకాశ్, శివకుమార్, రాఘవేందర్‌రెడ్డి, సీతాలే, నవీన్‌కుమార్, బామిని శివకుమార్, పాల్గొన్నారు.

ఐకమత్యంతో సమస్యలు పరిష్కారం



చిన్నమంగళారంలో బుర్ర శంకర్‌తో నూతన కమిటీ

సెంట్రింగ్ యూనియన్ మండల అధ్యక్షుడు శంకర్

మొయినాబాద్ రూరల్: సెంట్రింగ్ కార్మికులు ఐకమత్యంతో ఉంటేనే సమస్యలు పరిష్కరించొచ్చని సెంట్రింగ్ యూనియన్ మండల అధ్యక్షుడు శంకర్ పేర్కొన్నారు. ఆదివారం మొయినాబాద్ మండలంలోని సెంట్రింగ్ యూనియన్ అసోసియేషన్ మండల స్థాయి గుత్తెదారుల నూతన కమిటీ కార్యవర్గ సమావేశాన్ని ఓ ఫామ్‌హౌజ్‌లో నిర్వహించారు. చేవెళ్ల నియోజకవర్గం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మండల నూతన కార్యవర్గాన్ని నియమించారు. మండల సెంట్రింగ్ యూనియన్ అసోసియేషన్ గుత్తెదారుల నూతన అధ్యక్షుడిగా చిన్నమంగళారం బుర్ర శంకర్, గౌరవ అధ్యక్షుడిగా దర్శన్‌సాగర్, ప్రధాన కార్యదర్శి చింతల రవిసాగర్, కోశాధికారిగా చింతల మునకసాగర్, చింతల నవీన్‌సాగర్, ఉపాధ్యక్షుడిగా షాపురం రాంరెడ్డి, చిలుకూరు రమేశ్, లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీగా సాగర్, అశోక్, యాదయ్య, చింతల నర్సింగ్‌సాగర్, సంఘం సభ్యులుగా ప్రభుసాగర్, రాజుసాగర్, సాయిరాంసాగర్, కాంతన్నసాగర్, రాజిరెడ్డి, ఎండి మౌలానా, ఎండి ఖాదర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బుర్ర శంకర్ మాట్లాడుతూ కార్మికులు ఐకమత్యంగా ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

యాచారం: యువతకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నందివనపర్తి గ్రామంలో జ్యోతి ఎడ్యుకేషన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. గెలుపొందిన జట్టుకు ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.30వేల విలువ చేసే ఫోర్స్ లైట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించి మంచి గుర్తింపు పొందాలన్నారు. క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహించే విషయంలో బీఎస్ఆర్ ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. చంద్రశేఖర్‌రెడ్డిని క్రీడాకారులు ఘనంగా సత్కరించారు.



చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న క్రీడాకారులు

చెరువును తలపించేలా..

డ్రైనేజీ పొర్లడంతో నిలిచిన మురుగు నీరు ● పట్టించుకోని అధికారులు



తుర్కయంజాల్: పురపాలక సంఘం కార్యాలయానికి కూత వేటు దూరంలో తుర్కయంజాల్‌లో గడిచిన రెండు నెలలుగా డ్రైనేజీ పొంగిపొర్లుతున్న అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఫలితంగా ఇళ్ల మధ్యలో చెరువును తలపించేలా నీరు నిలిచి, దుర్గంధం వెదజల్లుతోంది. పాలకులు, అధికారులు ఈ సమస్య పరిష్కారానికి ఎలాంటి ప్రణాళికలు రూపొందించకపోవడంతో సమస్య మరింత జటిలంగా మారింది. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి మురుగు నీటి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.